క్లుప్తంగా

జాబ్‌మేళా సద్వినియోగం చేసుకోవాలి

దహెగాం: జిల్లా కేంద్రంలో మంగళవారం నిర్వహించే జాబ్‌మేళాను యువకులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో రాజేశ్వర్‌గౌడ్ తెలిపారు. సుమారు 40 కంపెనీలకు చెందిన ప్రతినిధులు జాబ్‌మేళాలో పాల్గొంటున్నట్లు తెలిపారు. యువతీయువకులు మంగళవారం ఉదయం విద్యార్హత సర్టిఫికెట్లతో హాజరు కావాలన్నారు. ఆయా గ్రామ పంచాయతీల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు యువకులను జాబ్‌మేళాకు తరలించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

అనాథలకు ఆర్థిక సాయం అందజేత



ఆర్థిక సాయం అందజేస్తున్న ట్రస్టు సభ్యులు

దహెగాం: మండలంలోని చౌక గ్రామానికి చెందిన అనాథలకు సోమవారం ఆత్మీయ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. తల్లిదండ్రులను కోల్పోయి అనాథలుగా మారిన సిడాం రాజు, మమత, దీపిక, దివ్యలకు గతంలో 'సాక్షి'లో ప్రచురించిన కథనం ఆధారంగా ఆర్థిక సాయం అందించినట్లు ట్రస్టు అధ్యక్షుడు ఎస్.మహేందర్, ప్రధాన కార్యదర్శి సంపత్, ప్రచార కార్యదర్శి భూమేష్, సహాయ కార్యదర్శి శ్రీనివాస్ పేర్కొన్నారు.

చెక్కు అందజేత

కౌటాల: మండలంలోని సాండ్‌గాం గ్రామానికి చెందిన లబ్ధిదారుడు మొండికి సోమవారం ఎంపీపీ బసర్కార్ విశ్వనాథ్ సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారికి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. అన్ని వర్గాల ప్రజలను ఆదుకోవడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆయన వెంట సర్పంచ్ ఎకోన్‌కర్ దామోదర్, నాయకులు ఉన్నారు.

పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలి

కాగజ్‌నగర్‌టౌన్: విద్యార్థి దశ నుంచే పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీనరసింహం అన్నారు. కళాశాలలో ఆంగ్ల విభాగం ఆధ్వర్యంలో సోమవారం ప్రసిద్ధ ఆంగ్ల రచయిత విలియం షేక్‌స్పియర్ జయంతి పురస్కరించుకొని ప్రపంచ ఆంగ్ల భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ సీహెచ్ రాజు, లెక్చరర్లు ప్రేమ్‌కుమార్, ఎం.రాజేశ్వర్, టీమాజీ, శరత్‌చంద్ర, మహేశ్, సుస్మిత, కవిత పాల్గొన్నారు.

కొనసాగుతున్న వీవోఏల నిరసన

కాగజ్‌నగర్‌టౌన్/బెజ్జూర్/ కౌటాల: సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఐకేపీ వీవోఏలు చేపడుతున్న నిరవధిక సమ్మె కొనసాగుతోంది. సోమవారం 8వ రోజు ఒంటి కాలుపై నిలబడి వినూత్న రీతిలో నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ ఐకేపీ వీవోఏలుగా పనిచేస్తున్న తమను సెర్ప్ ఉద్యోగులుగా పరిగణించాలన్నారు. ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. బెజ్జూర్‌లో వీవోఏలు నిర్వహిస్తున్న సమ్మెకు బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి అర్షద్ హుస్సేన్ మద్దతు పలికారు. సమ్మెలో వీవోఏలు పాల్గొన్నారు

సాక్షి సినిమాలు

ఆసిఫాబాద్
కుమురంభీం : విరూపాక్ష
కాగజ్‌నగర్
వెంకటరమణ : విరూపాక్ష
- ఆసిఫాబాద్‌అర్బన్

కూరగాయల ధరలు

కూరగాయలు	ధర(కిలో)
టమాటా	రూ.20
సిమ్లామిర్చి	80
దోసకాయ	60
చామగడ్డ	60
వంకాయ	50
బీరకాయ	60
కాకరకాయ	60
బెండకాయ	60
అలసంద	40
దొండకాయ	60
పచ్చిమిర్చి	50
పాలకూర	40
సోరకాయ	60
రతాళం	60
గోబి(పూల్)	80
క్యాబేజి	60

-ఆసిఫాబాద్‌అర్బన్

సీసాలతో సిరులు..!

- ఖాళీ బీరు సీసాలు సేకరిస్తున్న పారిశుధ్య సిబ్బంది
- సీసాలమ్మి జీపీకి ఆదాయం సమకూర్చుతున్న అధికారులు
- వర్మీ కంపోస్ట్ తయారు చేసి రైతులకు విక్రయం
- ఆదర్శంగా నిలుస్తున్న కౌటాల గ్రామపంచాయతీ



సీసాలు విక్రయిస్తున్న పంచాయతీ అధికారులు (ఫైల్)



కౌటాల మండల కేంద్రం

కౌటాల: కౌటాల గ్రామ పంచాయతీ అధికారులు ఎక్కడా లేని విధంగా వినూత్నంగా ఆలోచన చేసి గ్రామ పంచాయతీకి ఆదాయం సమకూర్చుతున్నారు. గ్రామ పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో ప్రజలు తాగి పడేసిన బీర్, వైన్ సీసాలను సేకరించి విక్రయిస్తూ ఆదాయం పొందుతున్నారు. దీంతో పాటు వర్మీ కంపోస్ట్ తయారు చేసి రైతులకు విక్రయించి ఆదాయం పొందుతున్నారు. పంచాయతీ అధికారుల పనితీరును పలువురు అభినందిస్తున్నారు.

బీరు సీసాలతో ఆదాయం

గ్రామ పంచాయతీ అధికారులు వినూత్న ఆలోచనకు శ్రీకారం చుట్టారు. గ్రామ పంచాయతీ పరిధిలోని కౌటాల, కోయగూడ, నదిమాబాద్, సదాశివపేట, శివలింగపూర్ గ్రామాల్లో మందుబాబులు తాగి పడేసిన ఖాళీ బీరు సీసాలను సేకరిస్తున్నారు. డంపింగ్‌యార్డులో పారిశుధ్య కార్మికులు ప్రతీ రోజు సేకరించే చెత్తతోపాటు మందుబాబులు తాగి పడేసిన సీసాలు కుప్పలుతెప్పలుగా జమయ్యాయి. ఇటీవల కొద్ది రోజుల పాటు పంచాయతీ కార్మికులు సేకరించిన ఖాళీ బీరు సీసాలను విక్రయించగా రూ.5వేల ఆదాయం వచ్చింది.

వర్మీ కంపోస్ట్ తయారీ

కౌటాల గ్రామ పంచాయతీలోని సెగ్రిగేషన్ షెడ్‌లో చెత్తతో వర్మీ కంపోస్ట్ తయారు చేస్తున్నారు. చెత్త నుంచి సిరులు కురిపించేలా ప్రణాళిక రూపొందించి అమలు చేస్తున్నారు. ఇప్పటి వరకు కౌటాల గ్రామ పంచాయతీలో 5 క్వింటాళ్ల వరకు వర్మీ కంపోస్ట్ తయారు చేసి రైతులకు విక్రయించారు. దీంతో పంచాయతీలకు ఆదాయం సమకూర్చుకున్నారు. వర్మీ కంపోస్ట్ ఎరువును హరితహారం, నర్సరీ, పల్లెప్రకృతి వనాల్లో వినియోగిస్తున్నారు. దీంతో ఇప్పటివరకు పంచాయతీకి సుమారు రూ.15 వేల వరకు ఆదాయం సమకూరినట్లు అధికారులు తెలిపారు. పంచాయతీ అధికారుల వినూత్న ఆలోచనతో పంచాయతీకి ఆదాయం సమకూర్చడంతో అటు అధికారులు, ఇటు ప్రజలు అభినందిస్తున్నారు.

అభివృద్ధికి సహకరించాలి



గ్రామ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికతో పనులు చేపడుతున్నాం. జీపీకి ఆదాయ మార్గాలను అన్వేషిస్తున్నాం. ఎమ్మెల్యే కోనప్ప సహకారంతో గ్రామంలో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు వంటి ఎన్నో అభివృద్ధి పనులు పూర్తి చేశాం. ప్రజలకు మౌలిక వసతులు కల్పిస్తున్నాం. గ్రామాభివృద్ధికి అందరూ సహకరించాలి.

- వొజ్జల మౌనిశ్, సర్పంచ్

జీపీకి అదనపు ఆదాయం



గ్రామ పంచాయతీల్లో చెత్తను సేకరించి సెగ్రిగేషన్ షెడ్లకు తరలిస్తున్నాం. అనంతరం తడి, పొడి చెత్తను వేరుచేసి వర్మీ కంపోస్ట్ ఎరువు తయారీకి వినియోగిస్తున్నాం. ఇటీవల మందుబాబులు తాగిపడేసిన బీరు బాటిళ్లు, విస్కీ, బ్రాందీ సీసాలను వేరు చేసి స్క్రాప్‌లో అమ్మగా రూ.5 వేల ఆదాయం వచ్చింది.

- ఎస్. సాయికృష్ణ, పంచాయతీ కార్యదర్శి

అంధకారంలో పల్లెలు



మరమ్మతు పనులు పరిశీలిస్తున్న అధికారులు

కాగజ్‌నగర్‌రూరల్/దహెగాం: గాలివాన బీభత్సంతో కాగజ్‌నగర్, దహెగాం, పెంచికల్‌పేట్ మండలాల్లోని పలు గ్రామాలు అంధకారంలో కొట్టుమిట్టాడుతున్నాయి. ఆదివారం సాయంత్రం గాలివానతో పలుచోట్ల విద్యుత్ స్తంభాలు పడిపోవడంతో జంబుగ, రాస్పెల్లి, గజ్జిగూడ, సీతానగర్, ఆరెగూడ, మోసం,నాగంపేట, సారసాల, తదితర గ్రామాలు రెండు రోజులుగా పూర్తిగా అంధకారంలో మగ్గుతున్నాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. దహెగాంకు వెళ్లే విద్యుత్‌లైన్ స్తంభాలు గజ్జిగూడ వద్ద నేలకొరగడంతో దహెగాం మండలానికి కూడా విద్యుత్ సౌకర్యం నిలిచిపోయింది. పెంచికల్‌పేట్‌కు వెళ్లే విద్యుత్‌లైనులో సమస్య తలెత్తడంతో పెంచికల్‌పేట్ మండలంలో సైతం విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విద్యుత్ శాఖ ఎస్‌ఈ వాసుదేవ్ పర్యవేక్షణలో డీఈఈ కేవీ రాజశేఖర్, ఏడీఈ శ్రీనివాస్, దహెగాం ఏఈ రవీందర్ ఆధ్వర్యంలో మరమ్మతు పనులు చేపడుతున్నారు. అధిక సంఖ్యలో స్తంభాలు పడిపోవడంతో విద్యుత్ సరఫరా పునరుద్ధరణలో జాప్యం జరుగుతుంది. మంగళవారం నాటికి విద్యుత్ సరఫరా అందిస్తామని అధికారులు పేర్కొంటున్నారు.

రాజకీయపార్టీలకు అవగాహన సదస్సు



మాట్లాడుతున్న తహసీల్దార్ సరిత

పెంచికల్‌పేట్: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం రాజకీయ పార్టీల నాయకులకు భారత ఎన్నికల సంఘం ప్రవేశపెట్టిన నూతన ఫారం బి, 6బి, 7, 8లపైన తహసీల్దార్ సరిత అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటరు జాబితాలో సవరణలో పాటించాల్సిన నియమాలను వివరించారు. సమావేశంలో ఆయా పార్టీల అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఓటర్ లిస్టులో సవరణలకు సహకరించాలి

రెబ్బెన: రాబోయే ఎన్నికల నేపథ్యంలో ఓటర్ లిస్టులో సవరణలకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని తహసీల్దార్ మల్లికార్జున్ అన్నారు. సోమవారం మండలంలోని రాజకీయ పార్టీల నాయకులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతీ పోలింగ్ స్టేషన్ల పరిధిలో డబుల్ ఓటర్ల తొలగింపు, మృతి చెందిన, ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన ఓటర్ల తొలగింపు, కొత్త ఓటర్ల నమోదు, ఓటర్ల కార్డులో పుట్టిన తేదీ సవరణలు వంటి చర్యలు త్వరగా పూర్తి చేయాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు జారీ అయ్యాయన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వేముర్ల సంతోష్, ఎంపీపీ సౌందర్య, బీజేపీ జిల్లా కార్యదర్శి కుందారపు బాలక్రిష్ణ, మండల ప్రధాన కార్యదర్శి నవీన్, సీపీఐ మండల కార్యదర్శి దుర్గం రవీందర్, టీఆర్ఎస్ మహిళా మండల అధ్యక్షురాలు అరుణ, కాంగ్రెస్ నాయకులు రమేశ్, దేవాజీ పాల్గొన్నారు.

పరిహారం చెల్లించాలని రైతుల ఆందోళన



నిరసన తెలుపుతున్న పాల్వాయి హరీశ్‌బాబు

కాగజ్‌నగర్‌రూరల్: అకాల వర్షాలతో పంట నష్టపోయినా అధికారులు సర్వే చేపట్టడం లేదని, దెబ్బతిన్న పంటలకు పరిహారం అందించాలని సోమవారం కాగజ్‌నగర్- బెజ్జూర్ రహదారిపై ఆరెగూడకు చెందిన రైతులు బైఠాయించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ వర్షాలకు పంటలు దెబ్బతిన్నాయని, ఇళ్ల పైకప్పులు ఎగిరిపోవడంతో నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. అయినా అధికారులు, ప్రజాప్రతినిధులు కన్నెత్తి చూడటం లేదని ఆరోపించారు. సుమారు అరగంట పాటు నిరసన కొనసాగించారు. వీరి ధర్నాకు బీజేపీ నాయకుడు పాల్వాయి హరీశ్‌బాబు సంఘీభావం ప్రకటించారు. రైతులతో కలిసి మాట్లాడుతూ అధికారులు స్పందించి ఎకరాకు రూ.30వేల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ మునవార్ షరీఫ్ ఘటన స్థలానికి చేరుకుని రైతులతో మాట్లాడారు. సర్వే చేపట్టి పరిహారం అందిస్తామని హామీ ఇవ్వడంతో రైతులు శాంతించారు. కార్యక్రమంలో రైతులు రౌతు పురుషోత్తం, బాబురావు, శంకర్, బాబురావు, జైహింద్, సోమయ్య, రవి, సాయికుమార్, గణపతి, రాజేందర్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

'నిధులపై అసత్య ఆరోపణలు సరికాదు'



మాట్లాడుతున్న ఉద్యోగులు, గ్రామస్తులు

రెబ్బెన: గోలేటి కోదండ రామాలయంలో ఆలయ నిధుల విషయంలో కొంత మంది అసత్య ఆరోపణలు చేయటం సరికాదని సింగరేణి ఉద్యోగులు, పలువురు గ్రామస్తులు అన్నారు. సోమవారం ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. కోదండ రామాలయంలో ఆలయ నిధులు దుర్వినియోగమైనట్లు బీజేపీ నాయకులు ఆరోపణలు చేయటాన్ని తప్పుపట్టారు. నిధులు ఎలాంటి దుర్వినియోగానికి గురికాలేదని కేవలం కొంతమంది పనిగట్టుకుని కక్షపూరితంగా ఆరోపణలు చేస్తున్నారన్నారు. సమావేశంలో ఉద్యోగులు వెంకటేశ్వర్లు, సదాశివ్, శేషు, శ్రీనివాస్, చంద్రశేఖర్, కిరణ్‌బాబు, మహేష్‌రెడ్డి, శ్రీనివాస్, గ్రామస్తులు నాగయ్య, శ్రీధర్‌రెడ్డి, తిరుపతి, శ్రీనివాస్, నూతన్‌రెడ్డి, నరేష్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల్లోని సమస్యలు పరిష్కరించాలి



మురళీగూడలో సమస్యలు తెలుసుకుంటున్న అర్షద్‌హుస్సేన్

పెంచికల్‌పేట్: మారుమూల గిరిజన గ్రామాల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి అర్షద్ హుస్సేన్ డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని మురళీగూడ, జిల్లెడ, కమ్మర్‌గాం, నందిగామ గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఆయన మాట్లాడుతూ కొన్నేళ్లుగా మారుమూల గిరిజన గ్రామాలు అభివృద్ధికి నోచుకోవడం లేదన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు గ్రామాలకు పక్కా రహదారులు నిర్మించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట యువకులు సతీష్, తిరుపతి, రమేశ్, దేవాజీ ఉన్నారు.

'చలో మహబూబాబాద్' జయపద్రం చేయాలి



మాట్లాడుతున్న నాయకులు

కౌటాల: దివ్యాంగుల సమస్యలను పరిష్కరించాలని ఈ నెల 26న చేపట్టిన చలో మహబూబాబాద్ కార్యక్రమాన్ని దివ్యాంగులు జయప్రదం చేయాలని దివ్యాంగుల సంఘం జిల్లా అధ్యక్షుడు బి.మూర్తి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దివ్యాంగులకు రూ.6వేల పెన్షన్ అందించాలని డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు పిట్టల సత్యనారాయణ, నాయకులు రాజేశ్, పోశన్న, అరుణ్‌కుమార్, విలాస్, ఎల్లయ్య పాల్గొన్నారు.

జీఎం ఆఫీస్‌లో వారసులకు ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న అధికారులు

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి టౌన్‌షిప్‌లో గల జీఎం కార్యాలయంలో సోమవారం మెడికల్ అన్‌ఫిట్ అయిన, మృతి చెందిన ఉద్యోగుల వారసులకు అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. కారుణ్య నియామకాల్లో భాగంగా సింగరేణిలో ఉద్యోగాలు కల్పించేందుకు నిర్వహించిన ఇంటర్వ్యూకు ఐదుగురు అభ్యర్థులు హాజరయ్యారు. కార్యక్రమంలో పర్సనల్ మేనేజర్ లక్ష్మణరావు, డీవైపీఎం తిరుపతి, సంక్షేమ అధికారి వేణు, జూనియర్ అసిస్టెంట్ బాబా పాల్గొన్నారు.

నేడు బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని ఈజ్‌గాం దేవాలయం ఆవరణలో మంగళవారం ఉదయం 10 గంటలకు బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళన సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే కోనేరు కోనప్ప తెలిపారు. సమావేశానికి మండలంలోని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఇళ్ల స్థలాలు కేటాయించాలని వినతి



సమస్య వివరిస్తున్న నాయకులు

ఆసిఫాబాద్: ఇళ్ల స్థలాలు కేటాయించాలని జిల్లా కేంద్రంలోని రవిచంద్ర కాలనీలో నివాసముంటున్న బుడగ జంగాలు సోమవారం బీజేపీ ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ రాజేశంకు వినతిపత్రం సమర్పించారు. 20 ఏళ్లుగా ప్రభుత్వ స్థలంలో నివాసముంటున్న తమకు ఇక్కడే ఆధార్ కార్డులు, ఓటర్ ఐడీ కార్డులు ఉన్నాయని తెలిపారు. ఇటీవల పోలీసులు వచ్చి గుడిసెలు తొలగించాలని, లేకపోతే జేసీబీలతో తొలగిస్తామని చెప్పారని అన్నారు. ప్రభుత్వం స్పందించి తమను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఆత్మారాం నాయక్, దళితమోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు జయరాజ్, నాయకులు రాజేశ్, నరేశ్, రాజు, కాలనీ మహిళలు ఉన్నారు.

ఇసుక అక్రమ రవాణా అరికట్టాలి

రెబ్బెన: మండలంలోని వంకులం వాగు నుంచి నిత్యం కొనసాగుతున్న ఇసుక అక్రమ రవాణాను వెంటనే అరికట్టాలని డీవైఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ మల్లికార్జున్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ వంకులం వాగు నుంచి ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా ప్రతీరోజు ట్రాక్టర్ల ద్వారా యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోందన్నారు. వాగు నుంచి ఇసుకను తరలిస్తుండటంతో భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయని ఆరోపించారు. అధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాను వెంటనే అరికట్టేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల సహాయ కార్యదర్శి నీలేష్ తదితరులు పాల్గొన్నారు.

'కంటివెలుగు' సద్వినియోగం చేసుకోవాలి



చింతలమానెపల్లి: శిబిరం ప్రారంభిస్తున్న ఎంపీపీ

రెబ్బెన: మండలంలో ఏర్పాటు చేస్తున్న కంటివెలుగు శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ వేముర్ల సంతోష్ అన్నారు. మండలంలోని నారాయణపూర్‌లో సోమవారం కంటివెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. సర్పంచ్ వేముర్ల అమృతతో పాటు గ్రామ ప్రజలు కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఎంపీటీసీ దుర్గం రాము, ఉపసర్పంచ్ రవీందర్, మెడికల్ ఆఫీసర్ రాకేష్, హెల్త్ అసిస్టెంట్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

చింతలమానెపల్లి: ప్రభుత్వం ప్రజల ఆరోగ్యం కోసం ప్రవేశపెట్టిన కంటివెలుగు వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ డుబ్బుల నానయ్య అన్నారు. సోమవారం మండలంలోని ఖర్జెల్లి కంటివెలుగు వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించారు. కంటివెలుగు శిబిరం అధికారి బండి సాయి క్రిష్ణ గౌడ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాజన్న, కోఆప్షన్ సభ్యుడు హుస్సేన్, ఎంపీడీవో మహేందర్, సర్పంచ్ నానయ్య, నారాయణ పాల్గొన్నారు.

గాలివానతో తీవ్ర నష్టం



అడెపల్లి గ్రామంలో ఎగిరిపోయిన రేకులు

చింతలమానెపల్లి: మండలంలో సోమవారం గాలివాన బీభత్సం సృష్టించింది. మండలంలోని చింతలమానెపల్లి, కర్జెల్లి, బాబాసాగర్, రుద్రాపూర్, అడెపల్లి, డబ్బా గ్రామాలలో భారీ గాలులతో కూడిన వర్షం పడింది. అడెపల్లి గ్రామంలో అతికం అశోక్‌గౌడ్ ఇంటి రేకులు లేచిపోగా, కొడిపె మల్లయ్య ఇల్లు కప్పు లేచిపోయింది. అన్నం శివయ్య ఇంటి గోడ కూలింది. విద్యుత్ స్తంభాలు నేలకొరగడంతో కరెంట్ సరఫరా నిలిచిపోయింది. అకాల వర్షంతో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది.

బెజ్జూర్‌లో..

బెజ్జూర్: మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం రాత్రి వడగండ్ల వాన బీభత్సం సృష్టించింది. గాలి దుమారంతో ఇంటి పైకప్పు రేకులు ఎగిరిపడ్డాయి. దీంతో జనాలు ఆందోళనకు గురయ్యారు. మండలంలోని మొుంజంపల్లి గ్రామంలో మల్లేష్ అనే వ్యక్తి ఇంటి పైకప్పు రేకులు ఎగిరి కొంతదూరంలో పడ్డాయి. ఇంట్లో ఉన్న బియ్యం, పప్పుదినుసులు సహా రూ.50వేల విలువ చేసే నిత్యావసర సరుకులు తడిసి ముద్దయ్యాయి.

నష్టపోయిన పంటల పరిశీలన

పెంచికల్‌పేట్: ఈదురుగాలులతో కురిసిన భారీ వర్షం మండలంలోని రైతులకు తీరని నష్టం మిగిల్చింది. ఆయా గ్రామాల్లో వందల ఎకరాల్లో వరి పంట పూర్తిగా ధ్వంసమైంది. గ్రామపంచాయతీల్లో విద్యుత్ స్తంభాలు నేలకొరగడంతో రెండు రోజులగా మండలానికి విద్యుత్ సరఫరా లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీల్లో ఏర్పాటు చేసిన నర్సరీలు వడగండ్ల వానకు పూర్తిగా దెబ్బతిన్నాయి. వర్షం వల్ల నష్టపోయిన పంటలను పెంచికల్‌పేట్ ఇన్‌చార్జి ఏడీఏ రాజులనాయుడు పరిశీలించి వివరాలు నమోదు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు మండలంలో 2200 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు తెలిపారు.

దహెగాంలో..

దహెగాం: మండలంలోని ఒడ్డుగూడ, కర్జి, గెర్రె, గిరవెల్లి గ్రామాల్లో ఆదివారం కురిసిన అకాల వర్షానికి నష్టపోయిన వరి పంటలను ఏఈవో సుస్మిత సోమవారం పరిశీలించారు. వడగండ్ల వానకు వరి గింజలు రాలిపోయినట్లు గుర్తించామన్నారు. రాళ్ల వానకు వరి గింజలు రాలిపోయాయని రైతులు వాపోయారు.



దహెగాం: పంటలు పరిశీలిస్తున్న ఏఈవో



పెంచికల్‌పేట్: వరి పంట పరిశీలిస్తున్న ఏడీఏ

వంతెన నిర్మాణ పనులు పూర్తి చేయాలి



పనులు పరిశీలిస్తున్న ఎంపీపీ మల్లికార్జున్

ఆసిఫాబాద్‌అర్బన్: రానున్న వర్షాకాలంలోపు మండలంలోని గుండి వంతెన నిర్మాణ పనులను పూర్తి చేయాలని ఎంపీపీ అరిగెల మల్లికార్జున్ తెలిపారు. సోమవారం గుండి వంతెన నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గతంలో ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం వర్షాకాలంలోపు వంతెనను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. వంతెన నిర్మాణ పనులను వేగవంతం చేసేందుకు సంబంధిత కాంట్రాక్టర్‌పై ఒత్తిడి చేస్తున్నామని పేర్కొన్నారను. వీరి వెంట సింగిల్ విండో చైర్మన్ అలీబిన్ అహ్మద్, వైస్ ఎంపీపీ సుంకరి మంగ, నాయకులు పెంటయ్య, తదితరులు ఉన్నారు.